సంచలన సాయంకాల పత్రిక


# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 28-7-2025

సంపుటి: 21 సంచిక: 107

పేజీలు: 8 వెల: రూ.1



- లోపలి పేజీలో

జపాన్ శ్రీమంతుడు.. ఇప్పుడు ఉత్తరాఖండ్ బాబా!

# డీఈవో వలన.. డీఈవో కొరకు.. డీఈవో చేత!



- మాల్‌ప్రాక్టీసింగ్ అవాస్తవం
- తిరుమల చైతన్యకు భయపడే డబ్బులిచ్చారంటూ స్టేట్‌మెంట్లు
- విచారణ అధికారి ముందు లిఖితపూర్వక వాంగ్మూలం ఇచ్చిన యూనియన్ లీడర్లు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గడిచిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కుప్పిలి జడ్పీ హైస్కూల్ కేంద్రంగా విద్యార్థులు మాల్‌ప్రాక్టీసింగ్‌కు పాల్పడ్డారని, ఇందుకోసం కుప్పిలి పాఠశాలలో పని చేస్తున్న గమస్తా కిశోర్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సొమ్ములు వసూలుచేసి లంచాలిచ్చారని 14 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం పూర్తిగా డీఈవో తిరుమలచైతన్య కోసం ఆడిన నాటకమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తంగి మురళీమోహనరావు, మజ్జి మదన్మోహనరావు, చౌదరి రవీంద్ర, ఎస్‌వీ రమణమూర్తి, జి.రమణ, ఎస్.రమేష్‌బాబులు విచారణ అధికారి శ్రీనివాసులురెడ్డి ముందు లిఖిత పూర్వకంగా వాంగ్మూలం ఇచ్చారు. తిరుమల చైతన్య మీద వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో సోమవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది ప్రశ్నలను విచారణ అధికారి యూనియన్ నేతల ముందు ఉంచారు. దీనికి సమాధానం ఇచ్చిన మేరకు ఏ పరీక్షా కేంద్రంలో అయితే మాల్ ప్రాక్టీసింగ్ జరిగిందని డీఈవో పేర్కొన్నారో, అదే పరీక్షా కేంద్రాన్ని ప్రశ్నాపత్రం ఇవ్వడానికి ముందు 30 నిమిషాల పాటు ఎచ్చెర్ల ఎంఈవో 2 రాజ్‌కిశోర్ ప్రతీ అంగుళం పరిశీలించారని, ఆయన కేంద్రం నుంచి బయటకు వెళ్లిన వెంటనే డీఈవోను పిలిచి పెద్ద ఎత్తున కాపీయింగ్ జరిగినట్లు కలరింగ్ ఇచ్చారని, ఇందుకోసం దళిత మహిళలను రంగంలోకి దించారని పేర్కొన్నారు. లావేరు ఎంఈవో-1 వాగ్దేవి, రాజ్‌కిశోర్‌లను కూడా విచారణ అధికారి లిఖితపూర్వకంగా సమాధానాలివ్వాలంటూ ప్రశ్నావళి అందించారు. డీఈవో కూడా తన ప్రశ్నలకు సమాధానమివ్వాలంటూ విచారణ అధికారి పేర్కొనగా, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తాను ఇస్తానంటూ డీఈవో సమాధానమిచ్చినట్టు భోగట్టా. పరీక్షా కేంద్రంలో దొరికాయని చెబుతున్న స్లిప్పులకు, ప్రశ్నపత్రానికి సంబంధం లేదని, ఇన్విజిలేటర్ సంతకం లేకుండా ఉద్దేశపూర్వకంగా డిబార్ చేయడం అశాస్త్రీయమని సంఘ నేతలు రాశిచ్చారు. బుడగట్లపాలెం, కొయ్యాం పాఠశాల ప్రధానోపాధ్యాయులను డీఈవో పిలిపించుకొని కుప్పిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్ కిశోర్‌కు డబ్బులిచ్చామని బలవంతంగా స్టేట్‌మెంట్లు రాయించుకున్నారని సంబంధిత ప్రధానోపాధ్యాయులు విచారణాధికారికి రాసిచ్చారు. సుమారు 20 మంది అధికారులను ఒక పరీక్షా కేంద్రంలో హల్‌చల్ చేయించి, 90 నిమిషాల పాటు గందరగోళం సృష్టించడం వల్ల పరీక్షా కేంద్రంలో 25/1997 యాక్ట్ అమలు కాకుండా డీఈవో చేశారని యూనియన్ నేతలు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంతో సంబంధం లేని వ్యక్తులను కూడా సస్పెండ్ చేసి డీఈవో ఆయన కొరకు, ఆయన చేత, ఆయన వల్ల మాత్రమే ఇది సాధ్యమన్న రీతిలో వ్యవహరించారని అందులో పేర్కొన్నారు. ఇవి కాకుండా డీఈవో మీద ఇతర అభియోగాలు కూడా ఉంటే చెప్పాలనడంతో 2023లో జరిగిన బదిలీల్లో తిరుమల చైతన్య అక్రమాలకు పాల్పడ్డారని, ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌కు రాని ఏడుగురికి మాన్యువల్‌గా ఉత్తర్వులిచ్చారని, ఇందు కోసం 10 శాతం ఖాళీలను బ్లాక్ చేశారని, 2024లో కేజీబీవీ పాఠశాలలో బోధన, బోధనేతర పోస్టులు నింపడానికి రోస్టర్ పాటించలేదని, 2025 బదిలీల్లో స్పౌజ్ నిబంధనలను తనకు అనుకూలంగా మార్చుకున్నారని, మూడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8 తరగతులు కలిసి 40 మంది విద్యార్థులు లేకపోయినా ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారని, వమరవల్లి డైట్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా పాత భవనాలను కూల్చేసి, అందులో ఉన్న కలప, ఇనుమును లక్షల రూపాయలకు అమ్మేసి, డబ్బును ఆయన వ్యక్తిగతానికి వాడుకున్నారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు విచారణాధికారికి లిఖితపూర్వకంగా తెలిపారు.



# రాజకీయ కత్తుల కరచాలనం!

- విలువలకు పట్టం.. ప్రత్యర్థుల సంగమం
- ప్రత్యర్థి అయినా ధర్మానను గౌరవించిన గొండు
- ఎన్నికల్లోనే రాజకీయమన్న సంప్రదాయానికి పెద్దపీట
- సీనియర్ అయిన ధర్మానకే ముఖ్యఅతిథి పాత్ర



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రత్యర్థులు ఎదురుపడ్డారు. కానీ అక్కడేమీ యుద్ధం జరగలేదు. పైగా ఇద్దరి మధ్య మాటలు కలిశాయి. కుశల ప్రశ్నల వర్షం ఇద్దరి మీదా కురిసింది. అనంతరం ఇద్దరూ కలిసే వేదికను పంచుకున్నారు. ఆద్యంతం వారు సుహృద్భావ పూరితంగా వ్యవహరించడం కార్యక్రమానికి హాజరైన వారందిరినీ విస్మయానందాలకు గురి చేసింది. అదే సమయంలో ఎంత ఒదిగి ఉంటే.. గౌరవం అంత ఇనుమడిస్తున్న దానికి ఈ ఉదంతం నిదర్శనంగా నిలిచింది. ఎమ్మెల్యే గొండు మాజీ అయిన ధర్మానను గౌరవించడం ఆయనకే భూషణంగా భాసించింది. ఈ అద్భుత దృశ్యానికి నగరంలో జరిగిన లయన్స్ క్లబ్ హర్షవల్లి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం వేదికైంది. సాధారణంగా రాజకీయ ప్రత్యర్థులు ఒకే కార్యక్రమంలో పాల్గొనాల్సి వచ్చినప్పుడు ఎవరో ఒకరు ముందు వచ్చి వెళ్లిపోతారు.. ఆ తర్వాతే రెండోవారు హాజరుకావడం సర్వసాధారణంగా జరుగుతుంటుంది. నిర్వాహకులు కూడా అనవసర ఉద్రిక్తతలను నివారించడానికి ప్రత్యర్థులు ఎదురు పడకుండా చాలా జాగ్రత్తగా కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తుంటారు. కానీ ఆదివారం లయన్స్ క్లబ్ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అనూహ్యంగా వైకాపాకు చెందిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్ ఎదురుపడ్డారు. అయితే ఇద్దరూ ముభావంగానో, మొహం ముడుచుకుంటూనో ముఖం చాటుచేయడానికి ప్రయత్నించకపోగా ఒకరికొకరు పలకరించుకుని, కుశల ప్రశ్నలు వేసుకున్నారు.




2024 ఎన్నికల్లో వైకాపా నుంచి ధర్మాన, టీడీపీ నుంచి శంకర్ పోటీ చేసి ముఖాముఖీ తలపడ్డారు. ఎన్నికల్లో ప్రత్యర్థులుగా వ్యవహరించిన వారిద్దరూ ఎన్నికల తర్వాత ఇంతవరకు పరస్పరం ఎదురుపడలేదు. కానీ లయన్స్ క్లబ్ కార్యక్రమం ఆ దృశ్యాన్ని ఆవిష్కరించింది. కార్యక్రమానికి గొండు శంకర్ ముందుగా వచ్చారు. ఆయన మొక్కలు నాటుతున్న సమయంలోనే ధర్మాన వచ్చేశారు. ఆయన్ను గమనించిన ఎమ్మెల్యే శంకర్ ఏమాత్రం సంకోచించకుండా, ఆలోచించకుండా ఎదురెళ్లి ఆయన్ను పలకరించారు. ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ముందుగా నిర్వాహకులు ధర్మానకు కాఫీ ఇచ్చారు. ఈలోగా వేదికపైకి పిలుపు రావడంతో 'నేను వస్తాను.. ముందు మీరు స్టేజి మీదకు వెళ్లండి' అని ధర్మాన సూచించడంతో శంకర్ వేదికపైకి వెళ్లారు. అయితే సీట్లు కూర్చోకుండా ధర్మాన వచ్చే వరకు నిలబడే వెయిట్ చేయడం ద్వారా సభామర్యాద

- మిగతా చివరి పేజీలో

# మేజర్ కవిత బ్రహ్మపుత్ర విజేత







- అటు సైన్యం.. సాహసయాత్రలతో ప్రత్యేక గుర్తింపు
- ఏకంగా ఐదుసార్లు గౌరీచెన్ పర్వతారోహణ
- అత్యంత ప్రమాదకరమైన హిమాలయన్ నదిలో రాఫ్టింగ్
- ఏకంగా 28 రోజులపాటు 1040 కి.మీ. విజయ యాత్ర
- సైన్యంలో కెప్టెన్ నుంచి మేజర్ స్థాయికి ఎదుగుదల
- వైద్య కోర్సు చేసినా ధైర్యంగా ఆర్మీ సేవల్లో చేరిక
- వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు ఆమె స్వగ్రామం

- మహిళల విషయంలో సమాజం ఎంత మారినా.. ఎంత చైతన్యవంతమైనా.. ఇంకా అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లకు ఉన్నత చదువులెందుకన్న అభిప్రాయం బలంగా ఉంది.
- చదువుల సంగతి సరే.. ఆడపిల్లలు సైన్యం వంటి రక్షణదళాల్లో చేరడాన్ని అభ్యంతరపెట్టే.. వింతగా చూసే పరిస్థితులు ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో ఉన్నాయి.
- ఎంబీబీఎస్ చేసిన అమ్మాయి ఏ ప్రభుత్వ ఉద్యోగమో లేదా ప్రైవేట్ ఆస్పత్రుల్లోనో పని చేయడం లేదా సొంతంగా క్లినిక్ పెట్టుకుని కడుపులో చల్ల కదలకుండా హాయిగా ఉండకుండా రక్షణ సర్వీసుల్లో చేరడం ఏమిటిటన్న మూతివిరుపులూ సహజమే.

..వీటన్నింటినీ బ్రేక్ చేసిన ధీర వనిత కవిత వాసుపల్లి. వైద్య విద్యనభ్యసించిన ఆమె తన ఇష్టానికి అనుగుణంగా.. దేశ సేవలో భాగస్వామి కావాలన్న తపనతో భారతీయ సైన్యంలో చేరి మేజర్ హోదాకు ఎదిగారు. క్లిష్టమైన ఉద్యోగంలోనూ సాహసాలను వెతుక్కుంటూ.. వాటిలో విజయాన్ని ఆస్వాదిస్తూ ముందుకు సాగుతున్న కవిత శ్రీకాకుళం జిల్లా ఆడపడుచు కావడం గర్వకారణం.





డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన చెందిన కవిత వాసుపల్లి నలుగురు నడిచే దారిలో కాకుండా.. భిన్నంగా ప్రయాణించే ప్రత్యేకత చాటుకునే తత్వం కలిగిన యువతి. చిన్నతనం నుంచీ అదే విధంగా పెరిగారు. తల్లిదండ్రులు కాదన్నా.. ఒప్పించి మరీ వారినే తన దారికి తెచ్చుకునే తత్వం ఆమెది. ఆ విధంగా ఆమె భారత ఆర్మీలో మేజర్ హెూదాలో వైద్యాధికారిగా పని చేస్తూనే పర్వతారోహణం, రివర్ రాఫ్టింగ్ వంటి సాహస క్రీడల్లో ప్రతిభ చూపుతూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. ఉద్దానం ప్రాంతమైన వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు ఆమె స్వగ్రామం. తండ్రి వాసుపల్లి రామారావు రైల్వేలో క్లర్క్ స్థాయి ఉద్యోగి. ప్రస్తుతం అసోంలో పని చేస్తున్నారు. తల్లి రమ్య గృహిణి. ఈ దంపతులకు కవిత ప్రథమ సంతానం కాగా.. మరో కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం సివిల్స్‌కు ప్రిపేరవుతున్నాడు. కవితకు చిన్నప్పటి నుంచీ క్రీడలు, సిమ్మింగ్ అంటే చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే ఈత సాధన చేసి బెస్ట్ స్విమ్మర్‌గా పేరుపొందారు. కానీ చదువు దెబ్బతింటుందన్న ఉద్దేశంతో ఆమెను కుటుంబ సభ్యులు పోటీలకు పంపలేదు. ఇక విశాఖలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో టెన్త్ వరకు చదువుకున్నారు. అక్కడే ఇంటర్ చదివిన అనంతరం వైద్యవిద్య వైపు మళ్లారు. సొంత జిల్లా అయిన శ్రీకాకుళంలోని రిమ్స్ వైద్య కళాశాలలో చదివి ఎంబీబీఎస్ పట్టా అందుకున్నారు.

## కెప్టెన్ నుంచి మేజర్ హోదాకు

ఆ తర్వాత మెడికల్ పీజీ చేయాలన్న చాలామంది సూచించినా కుటుంబ పరిస్థితులు, అప్పటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కుటుంబానికి ఆదరువుగా ఉండాలన్న ఉద్దేశంతో పైచదువులకు కాకుండా ఉద్యోగం వైపు కవిత మొగ్గు చూపారు. అయితే ఏ ఆస్పత్రిలోనో చేరకుండా.. భారత సైన్యం(ఆర్మీ)లో చేరారు. బంధువులు, తల్లిదండ్రులు వద్దంటున్నా.. వారిని ఒప్పించి 2021లో ఆర్మీ వైద్యాధికారిగా కెప్టెన్ హెూదాలో తొలి పోస్టింగ్ పొందారు. అనంతరం ప్రమోషన్ పొంది ప్రస్తుతం మేజర్ హెూదాలో ఉన్నారు. తొలి పోస్టింగ్ అరుణాచల్‌ప్రదేశ్‌లో పొందారు. అక్కడ పని చేస్తున్నప్పుడే తనకు ఇష్టమైన సాహస యాత్రలు చేస్తూ అబ్బుర పరుస్తున్నారు. గుర్తింపు పొందుతున్నారు. సాహస క్రీడలపై ఇష్టంతోనే అరుణాచల్‌ప్రదేశ్‌లోనే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ అనే సంస్థలో చేరి పర్వతారోహణకు సంబంధించి రెండు, రివర్ రాఫ్టింగ్(నదిలో చిన్న పడవలతో సుదీర్ఘ ప్రయాణం చేయడం)లో ఒక ప్రత్యేక కోర్సు చేశారు. సైన్యంలో కొనసాగుతూనే వ్యక్తిగతంగా ఈ కోర్సులు పూర్తి చేశారు.



## ఐదుసార్లు గౌరీచెన్ అధిరోహణ

పర్వతారోహణలో శిక్షణ తీసుకున్న మేజర్ కవిత.. అరుణాచల్ ప్రదేశ్‌లోనే అత్యంత ఎత్తయిన పర్వతంగా పేరొందని గౌరీచెన్‌ను కవిత ఐదుసార్లు అధిరోహించడం విశేషం. 6858 మీటర్ల ఎత్తున ఈ పర్వతాన్ని కల్నర్ రణవీర్‌సింగ్ జమ్వాల్ నేతృత్వంలలోని బృందంలో సభ్యురాలిగా కవిత ఉన్నారు. ఎవరెస్ట్ శిఖరాన్ని మూడుసార్లు అధిరోహించిన టెన్సింగ్ నార్కే అవార్డు గ్రహీత, మౌంటెనీరింగ్ సంస్థ డైరెక్టర్ అయిన రణ్‌వీర్‌సింగ్ ఆధ్వర్యంలో ఒకసారి గౌరీచెన్ అధిరోహించి తిరిగి కిందకి దిగివస్తున్న సమయంలో ఆ బృందంలోని ఒక యువ సభ్యురాలు ఊపిరి అందక ప్రమాదంలో పడితే.. స్వయంగా వైద్యురాలైన మేజర్ కవిత ఆమెకు స్వయంగా ప్రథమ చికిత్స చేసి ప్రాణగండం

- మిగతా చివరి పేజీలో

● ఎడిటోరియల్

# ఫస్ట్ అమెరికాకే నష్టం!

అగ్రరాజ్యం అమెరికా ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. ఆ దేశ పాలకుడి పెత్తందారీ ధోరణిని స్పష్టం చేస్తున్నాయి. గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడే వివాదాస్పద మైన డోనాల్డ్ ట్రంప్.. రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత మరింతగా రెచ్చిపోతున్నారు. ‘అమెరికా ఫస్ట్’ అన్న నినాదంతో ఎన్నికల్లో గెలిచిన ట్రంప్ తన హామీలు నిలబెట్టుకునే క్రమంలో తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న చర్యలు ఎదురుతిరిగి అమెరికాకే నష్టదాయకంగా పరిణమించనున్నాయి. ఇప్పటికే పలు నిర్ణయాలతో ప్రపంచ దేశాలను కలవరపాటుకు గురిచేసిన ట్రంప్.. తాజాగా భారతీయ ఐటీ నిపుణులపై అక్కసు వెళ్లగక్కారు. వారికి ఉద్యోగాలు ఇవ్వవద్దని గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ ఐటీ సంస్థలకు హుకుం జారీ చేశారు. ఆ ఉద్యోగాలేవో అమెరికన్లకే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అమెరికన్ ఐటీ కంపెనీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విధంగా హెచ్చరించడమే కాకుండా.. అమెరికా బయట పెట్టుబడులు పెట్టవద్దని కూడా ఐటీ సంస్థలకు సూచించారు. ఈ నిర్ణయంతో అమెరికాలోని ఐటీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అమెరికా వెళ్లాలనుకున్నవారు ఇప్పుడు కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి ప్రత్యామ్నాయ అవకాశాలు చూసుకుంటున్నారు. అయితే ఐటీ రంగం విషయంలో ట్రంప్ ఆలోచనలు, నిర్ణయాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే భారత్ కంటే అమెరికాకే ఎక్కువ చేటు జరుగుతుందని ఆ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో 30 శాతానికిపైగా ఐటీ ఉద్యోగులు భారతీయులే. పలు టాప్ ఐటీ సంస్థలను నడిపిస్తున్నవారు భారతీయ సంతతి వారే కాగా.. వెయ్యికిపైగా భారత సంసతి నిపుణులు సిలికాన్ వ్యాలీలో 40 బిలియన్ డాలర్లకు పైగా విలువైన స్టార్టప్‌లను స్థాపించారు. ఎక్కువ గంటలు పనిచేయడం, టీమ్ వర్క్‌లో నైపుణ్యం, పనిని ఓన్ చేసుకోవడం వంటి లక్షణాలతో భారతీయ టెకీలు ఐటీ కంపెనీలకు తిరుగులేని ఛాయిస్‌గా మారారు. అమెరికన్లతో పోలిస్తే భారతీయులు తక్కువ వేతనం.. అధిక నైపుణ్యంతో పని చేస్తారన్న పేరుంది. దీనివల్ల ఒక అమెరికన్ వేతనంతో ముగ్గురు భారతీయులను నియమించుకునే అవకాశం కంపెనీలకు లభిస్తోంది. ట్రంప్ విధానాలు అమలైతే భారతీయ ఐటీ నిపుణులు యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలకు తరలిపోయే అవకాశం ఉంది. ఈ దేశాలు వీసా విధానాలు, దీర్ఘకాలిక స్థిరత్వం వంటి వాటితో భారతీయ టాలెంట్‌ను ఆకర్షిస్తున్నాయి. భారతదేశంలోనూ ఐటీ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో చాలామంది నిపుణులు స్వదేశంలోనే కొత్త అవకాశాలు అందుకోగలుగుతారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి భారత్‌లోని బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో డెవలప్‌మెంట్ సెంటర్లను నిర్వహిస్తున్నాయి. ట్రంప్ హెచ్చరిక ఈ కంపెనీల దీర్ఘకాలిక లక్ష్యాలకు సవాలుగా మారుతుంది. ఇప్పటికే యాపిల్ సీఈవో టిమ్‌కుక్‌తో జరిగిన ప్రైవేట్ కార్యక్రమంలో ఇండియాలో కార్యకలాపాలు నిర్వహించడం తనకు ఇష్టం లేదని ట్రంప్ చెప్పేశారు. ఇప్పుడు గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు తమ ఆర్ అండ్ డీ, ఇంజినీరింగ్ ఉద్యోగులను తిరిగి యూఎస్‌కు రప్పించాలని కూడా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ట్రంప్ వ్యాఖ్యలపై భారత అధికారులు, ప్రపంచ ఆర్థికవేత్తలు, టెక్ ఇండస్ట్రీ లీడర్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతర్జాతీయ ప్రతిభావంతులకు భారతదేశం నెలవుగా ఉంది. చాలా కంపెనీలు ఇక్కడి నైపుణ్యాన్ని తమ అభివృద్ధికి ఉపయోగిస్తున్నాయి. ట్రంప్ నిర్ణయం అమెరికా ఆవిష్కరణలకు సహాయపడటం కంటే ఎక్కువ హాని కలిగిస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గ్లోబల్ టెక్ ఎకోసిస్టమ్‌లో భారత్‌ది కీలక పాత్ర. ప్రముఖ టెక్ సంస్థల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్లౌడ్ ఇన్‌ఫ్రా అంశాల్లో భారతీయ ఇంజినీర్లు, డెవలపర్లు, పరిశోధకుల పాత్రే కీలకం. అందువల్ల భారత్ నుంచి నియామకాలను నిలిపివేస్తే అమెరికా–భారత్ సంబంధాలు దెబ్బతింటాయన్న ఒక ఆందోళన కాగా.. అమెరికాలో సాంకేతిక పురోగతి మందగించవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ట్రంప్ ఆదేశాలు ప్రభుత్వ ఒప్పందాలు, ఏఐ గ్రాంట్లపై ఆధారపడే కంపెనీలనే ప్రభావితం చేస్తుందన్న మరో వాదన కూడా ఉంది. ఒకవేళ ప్రైవేట్ సంస్థలకు వర్తించినా పాటించే అవకాశం తక్కువగా కనిపిస్తోంది.



తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన డీఎస్పీ జల్లు శాంతారావు భౌతిక కాయానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిలు ఆదివారం నివాళులర్పించారు. శాంతారావు స్వస్థలం పోలాకి మండలంలోని డోల గ్రామంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన కలెక్టర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

**– సత్యంన్యూస్, నరసన్నపేట**

## లయన్స్ నిర్విరామ, నిస్వార్ధ సేవలకు సలాం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక బృందావనం ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వపు గవర్నర్ డిఎస్‌ఎస్వి వర్మ, ప్రస్తుత గవర్నర్ కె.వి.సుబ్బరాజు, నున్న శ్రీనివాసరావు నేతృత్వంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలిగా ప్రముఖ వైద్యురాలు పైడి సింధూర బాధ్యతలు అందుకోగా, కొత్త కార్యవర్గంలో టెక్కం రామ్ గోపాల్ (సెక్రటరీ), బరాటం కృష్ణచైతన్య (ట్రెజరర్), ఇతర ఎంసీ సభ్యులు, నూతన సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ డీజీపీ డాక్టర్ జె.పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ లయన్స్ నిర్విరామ, నిస్వార్ధ సేవలకు సలాం అని, సింధూర అధ్యక్షతన విలువలుగల సేవలు కొనసాగించి స్ఫూర్తిప్రదాతగా నిలవాలన్నారు. పూర్వపు గవర్నర్ డిఎస్‌ఎస్వి.వర్మ, ఉప గవర్నర్ నున్న శ్రీనివాసరావులు మాట్లాడుతూ సింధూర బృందం సేవా కార్యక్ర



మాలతో ముందుకుసాగాలన్నారు. నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్‌లు మాట్లాడుతూ సామాజిక బాధ్యతల నిర్వహణలో భాగంగా అంతా కలిసి పనిచేస్తూ ముందుకు వెళ్తామన్నారు. అనంతరం అధ్యక్షురాలు పైడి సింధూర మాట్లాడుతూ సమాజానికి అవసరమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజలలో మార్పు తెస్తానని, ముఖ్యంగా యువతను చైతన్యపరుస్తామన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రత్యేకదృష్టి సారిస్తామని, కాన్సర్ రహిత జిల్లాగా నడిపించడంలో ముఖ్య పాత్ర పోషిస్తానన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ఇతర సేవాసంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వక్తలు హాజరయ్యారు.

## లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

హర్షవల్లి లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు పేర్కొన్నారు. వావిలపల్లి జగన్నాథ నాయుడు అధ్యక్షతన జరిగిన హర్షవల్లి లైన్స్ క్లబ్ 2025 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ హర్షవల్లి లయన్ క్లబ్ అతితక్కువ కాలంలోనే అత్యున్నత సేవలను శ్రీకాకుళం పట్టణంలో అవసర ప్రజానీకానికి అందించి అగ్రస్థానంలో నిలబడిందని పేర్కొన్నారు. ముందుగా సమావేశ మందిర ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. లయన్స్ క్లబ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రజలలో సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. అనేక మందిని సేవా రంగంలోకి అడుగు పెట్టిస్తున్నాయని పేర్కొన్నారు. శ్రీకాకుళంలో గత నాలుగేళ్లుగా హర్షవల్లి లైన్స్ క్లబ్ తన సేవలందిస్తుందన్నారు. ఆర్డీఓ ప్రత్యూష మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకి స్వచ్ఛందసంస్థల సహాయ సహకారాలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్, 316ఏ లైన్స్ ఇంటర్నేషనల్ మొదటి గవర్నర్ సుబ్బరాజు, రీజనల్ చైర్మన్ లైన్స్ ఇంటర్నేషనల్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ఎక్స్‌టెన్షన్ చైర్‌పర్సన్ హారికప్రసాద్, డిసి కరణం శోభారాణి, డాక్టర్ కనుగుల సుధీర్, ఐఎంఏ అధ్యక్షుడు నరసింహమూర్తి, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ బాబు, ఏపీఈపీడీసీఎల్ జీఎం సలాధి సుబ్బారావు, రెడ్ క్రాస్ రాష్ట్ర వైస్‌చైర్మన్ పి.జగన్మోహనరావు, బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్థానిక కలెక్టర్ బంగ్లా దరి శ్రీకళ్యాణ తిరుమలలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వర దేవస్థానంలో గోదా అమ్మ వారి తిరు నక్షత్రం సందర్భంగా ప్రాతః కాలంలో అమ్మవారికి క్షీరభిషేకం, పంచామృతాభిషేఖం భక్తులు సమక్షంలో ఆలయ అర్చకులు బూరాడ వంశీకృష్ణమచార్యులు ఆధ్వర్యంలో జరిపిన అనంతరం నూతన వస్త్రాదారణ, విశేష అలంకరణ, తీర్ధగోష్టి, ప్రసాద వితరణ జరిపినట్లు ఆలయ గౌరవ అధ్యక్షులు లోకనాధం నందికేశ్వరరావు, అధ్యక్షలు మ్రి.యోగేశ్వరావు, కార్యదర్శి బెహరా నాగేశ్వర రావు, కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు

**– సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## ఇసుక ర్యాంపు సందర్శన

**(సత్యంన్యూస్, కొత్తూరు)**

మండలంలోని ఆత్మ గ్రామంలో గల ఇసుక ర్యాంపును మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పొలాలకు వెళ్లే దారిలో గోర్జి నుండి దౌర్జన్యంగా రోడ్డు వేస్తూ మాతల ఎత్తిపోతల పథకం కింద ఉండడం ఈ ఇసుక తవ్వకాల మూలంగా రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు పాలవుతారన్నారు. సుమారు మూడుమీటర్ల లోతు తవ్వి నదీగర్భంలోనే బాటలను వేస్తూ నది ప్రవాహ దిశను మార్చే విధంగా నదీగర్భంలో గట్టును ఎత్తుతున్నారన్నారు. దీని వలన తుఫాన్లు వచ్చేటప్పుడు నదికి ఇరువైపులా ఉన్న పదుల సంఖ్యలో గ్రామాలు గురవుతాయన్నారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించి తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె కోరారు. చర్యలు తీసుకోకుంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్తామని అధికారులందరూ సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చేస్తున్న మద్యం, ఇసుక, భూదందాల వలన ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. తక్షణమే ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తూరు మండల అధ్యక్షుడు ఆనందరావు, చింతాడ సూర్యనారాయణ, ఎంపీటీసీ ప్రతినిధి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






ఓవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా ‘హరిహర వీరమల్లు’ థియేటర్లలో సందడి చేస్తున్న సమయంలో దానికి పోటీగా తర్వాతి రోజే ఓ సినిమా రిలీజైంది. ఐతే అది తెలుగు చిత్రం కాదు.. కన్నడ అనువాదం. ‘మహావతార నరసింహా’ పేరుతో తెరకెక్కిన ఈ చిత్రంలో కథ మనకు బాగా పరిచయం ఉన్నదే. యానిమేషన్లో తెరకెక్కిన ఈ భక్తి చిత్రం విశేషాలేంటో చూద్దాం పదండి.

కథ విషయానికి వస్తే.. కశ్యప ముని భార్యల్లో ఒకరైన దితి.. అసందర్భ సమయలో భర్తను కలుస్తుంది. ప్రతిగా రాక్షసులైన కవలలు హిరణ్య కశ్యపుడు–హిరణ్యాక్షుడు జన్మిస్తారు. వీళ్లిద్దరినీ గురువు శుక్రాచార్యుడు.. మహా విష్ణువుకి శత్రువుల్లా తీర్చిదిద్దుతాడు. అసురులలో అగ్రగణ్యులుగా నిలిచిన వీళ్లిద్దరి అకృత్యాలకు అంతూ పొంతూ ఉండదు. వీరిలో హిరణ్యాక్షుడిని విష్ణువు వరాహ అవతారంలో వచ్చి సంహరిస్తాడు. దీంతో విష్ణువు మీద హిరణ్యకశ్యపుడు మరింత ద్వేషం పెంచుకుంటాడు. మరోవైపు కఠోర తపస్సుతో తనకు మరణం లేకుండా వరం కూడా పొందుతాడు. ఐతే విష్ణువు అంటే అస్సలు పడని హిరణ్య కశ్యపుడికి.. మహా విష్ణు భక్తుడైన ప్రహ్లాదుడు జన్మిస్తాడు. అతడి విష్ణు భక్తికి తట్టుకోలేక కన్నబిడ్డ అయినప్పటికీ సంహరించడానికి ప్రయత్నిస్తాడు హిరణ్యకశ్యపుడు. మరి తన భక్తుడిని విష్ణువు ఎలా కాపాడుకున్నాడు.. హిరణ్య కశ్యపుడిని ఎలా సంహరించాడు.. అన్నది మిగతా కథ.

# ‘భక్త ప్రహ్లాద’కు విజువల్ టచ్!

పురాణ గాథలను తెరకెక్కించడంలో తెలుగు సినిమా సత్తా ఏంటో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. భాగవతం.. మహాభారతం.. రామాయణం నేపథ్యంలో ఎన్నో కథలను దశాబ్దాల కిందటే వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించారు మన దర్శకులు. మనం టచ్ చేయని పురాణ గాథ లేదని.. వీటిలో తెలుగు సినిమాలకు సాటి వచ్చే చిత్రాలు మరే భాషలోనూ తెరకెక్కలేదు అంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు కన్నడలో తెరకెక్కిన ‘మహావతార నరసింహ’ కూడా తెలుగులో ఒకటికి రెండుసార్లు తెరకెక్కిన కథే. తెలుగులో తొలి టాకీ చిత్రంగా తెరకెక్కిన ఘనత అందుకుని.. తర్వాతి కాలంలో ఎస్వీ రంగారావు హిరణ్యకశ్యపుడిగా.. రోజా రమణి ప్రహ్లాదుడిగా తెరకెక్కిన ‘భక్త ప్రహ్లాద’ కథతోనే ఈ యానిమేషన్ ఫిలిం రూపొందింది. ఈ కల్ట్ కథనే ప్రస్తుత ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని యానిమేషన్లో భారీగా చెప్పే ప్రయత్నం చేసింది అశ్విన్ కుమార్ అండ్ టీం. ఫీచర్ ఫిలిం చూస్తే వచ్చే ఒరిజినల్ అనుభూతి రాదన్న మాటే కానీ.. యానిమేషన్లో ఈ కథను ఉన్నంతలో చాలా బాగానే చెప్పింది చిత్ర బృందం. ఆసక్తికర కథనంతో మెప్పిస్తూనే.. హాలీవుడ్ సినిమాలకు దీటైన విజువల్ ఎఫెక్ట్స్ తో ఈ చిత్రాన్ని భారీగా తీర్చిదిద్దింది. గూస్ బంప్స్ ఇచ్చే కొన్ని ఎపిసోడ్లతో ప్రేక్షకులకు మంచి అనుభూతినే ఇస్తుంది ‘మహావతార నరసింహ’.

మహావతార నరసింహకు ప్రధాన బలం.. పతాక సన్నివేశాలే. నరసింహావతారంలో విష్ణువు రంగ ప్రవేశం చేసిన దగ్గర్నుంచి హిరణ్య కశ్యపుడిని సంహరించే వరకు ఓ 20 నిమిషాల పాటు గూస్ బంప్స్ గ్యారెంటీ. ప్రపంచ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్ తో ఈ ఎపిసోడ్ ను అద్భుతంగా తీర్చిదిద్దారు మేకర్స్. యానిమేషనే కదా అని తీసి పడేయడానికి వీల్లేకుండా.. రెగ్యులర్ సినిమాలు చూస్తున్న భావన కలిగేలా పతాక సన్నివేశాలను తీర్చిదిద్దారు. ఆరంభంలో హిరణ్యాక్షుడిని వరాహ అవతారంలో విష్ణువు వధించే సన్నివేశాలు కూడా ఇంతే బాగా రూపొందించారు. సినిమాకు ప్రధాన ఆకర్షణ ఈ రెండు ఎపిసోడ్లే. విజువల్ ఎఫెక్ట్స్ ను బాగా ఉపయోగించుకున్న సినిమా ఇది. సామ్ సీఎస్ అదిరిపోయే బ్యాగ్రౌండ్ స్కోర్ తో సినిమాకు అతి పెద్ద బలంగా నిలిచాడు. ప్రేక్షకులకు కొన్ని ఎపిసోడ్లలో గూస్ బంప్స్ వచ్చేలా చేయడంలో ఆర్ఆర్ పాత్ర కీలకం. యానిమేటెడ్ మూవీ కావడం వల్ల.. ఇది సహజంగా అనిపించకపోవడం సమస్య కావచ్చు. మనం చూడబోయేది యానిమేటెడ్ మూవీ అని ప్రిపేరై రావడం కీలకం. సినిమాలో కొన్ని చోట్ల మాత్రం ఎఫెక్ట్స్ అంత ఎఫెక్టివ్‌గా లేవు. ఓవరాల్ గా చూస్తే.. మనకు తెలిసిన కథనే యానిమేషన్ విజన్లో భారీ స్థాయిలో.. ఆసక్తికరంగా చెప్పడంలో ‘మహావతార నరసింహ’ టీం సక్సెస్ అయిందని చెప్పొచ్చు.

ఖుషి టీవీ లాంటి పిల్లల ఛానెళ్లు చూస్తే.. పురాణ గాథలను యానిమేషన్లో చూపించే ప్రోగ్రామ్స్ బోలెడన్ని కనిపిస్తుంటాయి. మరి వాటిని మించి వెండితెరపై యానిమేషన్లో కొత్తగా ఏం ఆవిష్కరిస్తారు అనే సందేహం కలుగుతుంది. కానీ ‘మహావతార నరసింహ’ టీం మాత్రం ‘భక్త ప్రహ్లాద’ కథకు భారీ విజన్ జోడించి యానిమేషన్లో ఒక గొప్ప అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నించింది. తెలిసిన కథే అయినా.. బోర్ కొట్టించని కథనంతో.. చక్కటి సంభాషణలతో ఈ చిత్రాన్ని నడిపించడం విశేషం. కన్నడ సినిమా అయినప్పటికీ.. ఆ ఫీలింగ్ ఎంతమాత్రం కలగకుండా స్ట్రెయిట్ తెలుగు సినిమా చూస్తున్న ఫీలింగే వస్తుంది సినిమా చూస్తుంటే. సంభాషణలు అంత బాగా రాశారు. పురాణ గాథల మీద ఆసక్తి ప్రదర్శించే వారిని ఎంగేజ్ చేసేలా ఈ కథ సాగుతుంది. ఏ కాంప్లికేషన్ లేకుండా కథను చాలా సరళంగానే చెప్పింది చిత్ర బృందం. పాటలు.. కొన్ని సన్నివేశాల వల్ల మధ్యలో ఓ అరగంట కొంచెం నెమ్మదించిన భావన కలిగినా.. రెండు గంటల నిడివిలో మిగతా కథనమంతా బాగానే ఆసక్తికరంగానే సాగుతుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో



ఐరనీ ఏంటంటే.. ఓవైపు శాస్త్ర విజ్ఞానం, సైన్స్ వైపు అడుగులేయాలంటూ సోషల్ మీడియా వచ్చాక విపరీతమైన ప్రచారం మొదలైంది. అందుకు తార్కికమైన సమాధానాలను ముందుంచి మరీ ఆ ప్రచారం ఒకవైపు జరుగుతోంది. ఆధ్యాత్మికతకు పెట్టింది పేరైన భారతదేశంలో ఈ ప్రచారం అంతకంతకూ పెరుగుతుంటే.. సైన్స్, శాస్త్రీయ పరిశోధనలకు చిరునామా అయిన జపాన్ వంటి దేశాల్లోని కొందరు వ్యక్తులు ఏకంగా భారత్ వైపు చూస్తున్నారు. చూడ్డమే కాదు.. ఏకంగా ఇక్కడి సంప్రదాయలు, ఆచారాల పట్ల ఆకర్షితులై.. బాబాలుగా అవతరిస్తున్నారు. అలాంటి ఓ జపాన్ బాబా కథే ఇది.



# జపాన్ శ్రీమంతుడు..
# ఇప్పుడు ఉత్తరాఖండ్ బాబా!

**అతడో సంపన్నుడు. జపాన్‌లో ఉన్న తన సంపదనంతా వదిలి భారత్ మార్గం పట్టినవాడు.**

**20 మంది జపనీస్ అనుచరులను వెంటబెట్టుకుని పవిత్ర గంగా జలాల్ని వెంట బెట్టుకుని మోసుకువెళ్తూ ఆయన మిగిలిన సమాజం దృష్టిని ఆకర్షించాడు.**

**తాకయుకి ఆధ్యాత్మిక ప్రయాణం సుమారు 20 ఏళ్ల క్రితం తమిళనాడు పర్యటనతో ప్రారంభమైంది.**

**తాకయుకి గత జన్మంతా హిమాలయాల్లో గడిచిందని.. ఇప్పుడు కూడా హిందూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని ఆ జ్యోతిష్కులు చెప్పిన మాటలను నమ్మిన తాకయుకి ఇదిగో ఇప్పుడు బాబాగా అవతరించాడు.**

**ప్రస్తుతం తాకయుకి పుదుచ్చేరీలో 35 ఎకరాల భూమి కొనుగోలు చేసి ఓ శివాలయాన్ని నిర్మించబోతున్నాడని. ఇప్పటికే తాకయుకి ఉత్తరాఖండ్‌లో ఓ ఆశ్రమాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాడు.**



ఉత్తరాఖండ్‌లో ఓ శివభక్తుడిప్పుడు తోటి భక్తులను ఆకట్టుకుంటున్నాడు. ఎందుకంటే అతడో సంపన్నుడు. జపాన్‌లో ఉన్న తన సంపదనంతా వదిలి భారత్ మార్గం పట్టినవాడు. శివభక్తుడిగా కాషాయవస్త్రాలు ధరించి ఓ బాబా రూపంలో అవతారమెత్తినవాడు.

ఇప్పుడా బాబా పేరు బాల కుంభ గురుముని. 41 ఏళ్ల హెూషీ తాకయుకికి జపాన్ రాజధాని టోక్యోలో సౌందర్య సాధనాలకు సంబంధించి గొలుసుకట్టు దుకాణాలున్నాయి. కావల్సినంత ధనరాశులున్న సంపన్నుడు. కానీ, ఇప్పుడు ఉత్తరాఖండ్‌లో తీర్థయాత్రల కోసం చెప్పుల్లేకుండా తిరుగుతున్నాడు.

ఉత్తర భారతదేశంలో కన్వర్ యాత్ర ఫేమస్. ఈసారి ఇది ఇంకా ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. భక్తులు గంగానదిలోని నీటిని కావడి కట్టుకుని.. ఆ కావడికి ఓ బిందెను వేలాడదీసి.. అందులో నీళ్లు నింపుకుని పాదయాత్రగా వెళ్లి తమ ఊళ్ల దగ్గర ఉన్న దర్శనీయ స్థలాల్లోనే, లేక వారు మొక్కుకున్న ఏదైనా గుళ్లల్లోనో ఆ గంగానదీ జలంతో ఆ శివుణ్ని అభిషేకించడమే కన్వర్ యాత్ర ముఖ్యోద్దేశం.

అదిగో ఆ కన్వర్ యాత్రలో మెరిశాడు జపాన్‌కు చెందిన బాల కుంభ గురుముని. 20 మంది జపనీస్ అనుచరులను వెంటబెట్టుకుని పవిత్ర గంగా జలాల్ని వెంటబెట్టుకుని మోసుకువెళ్తూ ఆయన మిగిలిన సమాజం దృష్టిని ఆకర్షించాడు. అంతేకాదు, డెహ్రాడూన్‌లో తోటి కన్వారియుల కోసం రెండు రోజుల ఆహార శిబిరాన్ని నిర్వహించి వారికి కావల్సిన అల్పాహారం, భోజనాలు వంటివి అందించాడు.

తాకయుకి ఆధ్యాత్మిక ప్రయాణం సుమారు 20 ఏళ్ల క్రితం తమిళనాడు పర్యటనతో ప్రారంభమైంది. నాడీ జ్యోతిష్యానికి చిరునామా అయిన తమిళనాడుకు వెళ్లాక తన జీవితం మారిపోయింది. అక్కడికెళ్లిన తనకు తాకయుకి గత జన్మంతా హిమాలయాల్లో గడిచిందని.. ఇప్పుడు కూడా హిందూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని ఆ జ్యోతిష్కులు చెప్పిన మాటలను నమ్మిన తాకయుకి ఇదిగో ఇప్పుడు బాబాగా అవతరించాడు.

అంతేకాదు, తనకూ ఓ కల వచ్చిందని.. ఆ కలలో తాను పూర్వజన్మలో ఉత్తరాఖండ్‌లో ప్రయాణిస్తున్నానన్నాడు తాకయుకి. ఆ కల తన జీవితాన్నే మార్చివేసిందని చెబుతున్నాడతను.

మొత్తంగా ఆధ్యాత్మిక పరివర్తనతో తాకయుకి జీవితమే ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. జపాన్‌లో కోట్ల రూపాయల వ్యాపార సామ్రజ్యాన్ని వదులుకుని.. ఓ సన్యాసి గుర్తింపుతో మోక్షం కోసం బహుదూరపు బాటసారై పయనిస్తున్నాడు బాల కుంభ గురుముని తాకయుకి. ఇప్పుడు టోక్యోలోని తన ఇల్లు కూడా శివాలయం నమూనాలో మార్చేశాడు. త్వరలోనే ఒక మందిరాన్ని కూడా నిర్మిస్తానంటున్నాడు.

జపాన్‌లో తాకయుకి మిత్రుడైన భారత్‌కు చెందిన రమేష్ సుంద్రియల్ ఏమంటాడంటే.. ప్రస్తుతం తాకయుకి పుదుచ్చేరీలో ఓ 35 ఎకరాల భూమి కొనుగోలు చేసి ఓ శివాలయాన్ని నిర్మించబోతున్నాడని. ఇప్పటికే తాకయుకి ఉత్తరాఖండ్‌లో ఓ ఆశ్రమాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాడు.

మొత్తంగా దేవభూమి ఉత్తరాఖండ్‌తో తనది జన్మజన్మల బంధమంటున్నాడు తాకయుకి. కొండలు, కోనల్లో గత జన్మలో తానెక్కడ జన్మించానో శోధిస్తున్నానంటున్నాడు. ఉత్తరాఖండ్ కన్వర్ యాత్రలో మొత్తంగా ఓ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిల్చాడు.

**- బాతాఖానీ సౌజన్యంతో..**



## 'రావిశాస్త్రి' ప్రసంగానికి శరత్‌బాబు ఎంపిక




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రసిద్ధ రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి (రావిశాస్త్రి) జయంతి సందర్భంగా ప్రత్యేక ప్రసంగ కార్యక్రమాన్ని ఆకాశ వాణి (ఆలిండియా రేడియో స్టేషన్) నిర్వహిస్తోంది. శ్రీకాకుళం ప్రాంతంలో పుట్టి, విశాఖ పట్నంలో స్థిరపడిన ఆయన జయంతి రోజైన జులై 30న రేడియో ఉపన్యాసకునిగా జంధ్యాల శరత్‌బాబును ఎంపిక చేసింది. 'సామాన్యుడి అండదండ రాచకొండ' శీర్షికన ఈ కార్యక్రమం బుధ వారం ఉదయం 7.20 నుంచి ప్రసారమవుతుంది. శ్రీకాకుళంతో పాటు విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాల శ్రోతలు కూడా వినవచ్చని ఏఐఆర్ ఉన్నతాధికారులు తెలిపారు.

## నరసన్నపేట లయన్స్ క్లబ్‌కు ప్రశంసలు



**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

నరసన్నపేట మిలీనియం లయన్స్ క్లబ్ సేవలకు లయన్ పెద్దలు ప్రశంసించారు. నరసన్నపేటలో ఆదివారం రాత్రి కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో వీరు ప్రసంగించారు. విభిన్న సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, ఒకేసారి 20 మంది నూతన సభ్యులను చేర్పించటం క్లబ్ చరిత్రలో రికార్డని అన్నారు. నూతన అధ్యక్షులుగా తంగుడు రత్నకుమార్, కార్యదర్శిగా, పొట్నూరు రమేష్, కోశాధికారిగా కాసిన రమేష్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా డివిఎస్ వర్మ, కె.సుబ్బారావు, ఏ.శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణమోహన్, వివిఎం రావులు ప్రసింగించారు. గత కార్య వర్గం అధ్యక్షులు రమణ సాహు, కె.సాయిరాం, పి.రమేష్ నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా లయన్స్ నేతల సూచన మేరకు నరసన్నపేటలో మహిళా క్లబ్‌ను ప్రారంభించామని సూచించగా, క్లబ్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో సీనియర్ లయన్స్ ప్రతినిధులు ఊణ్ణ సోమేశ్వరరావు, డాక్టర్ గొలివి మోహన్, సదాశివుని క్రిష్ణ, కె.ఎల్.ఎన్.మూర్తి, ఊణ్ణ రంగనాథ్, వి.నాగరాజు, వివిఎస్ఎన్ మూర్తి, ఎస్ఎస్ఎస్ శర్మ, బి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సారథ్యంలో
# ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత గౌరవం

**❖ రాష్ట్ర కళింగకోమటి సంఘం అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంతో పాటు, ఇక్కడి నాయకులను ప్రోత్సహించడంలో కూడా తెలుగుదేశం పార్టీ ముందుంటుందన్న విషయం మరోసారి స్పష్టమైందని రాష్ట్ర కళింగకోమటి సంఘం అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెనబడిన ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతి రాజుకి గోవా గవర్నర్‌గా పదవి రావడం, కింజరాపు రామ్మోహన్‌నాయుడుని కేంద్ర విమానయాన మంత్రిని చేయడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు. అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి రావడం ఉత్తరాంధ్ర ప్రజలకు గర్వకారణమన్నారు.

ఉత్తరాంధ్రలో విద్యాసంస్థల స్థాపనకు, ఆలయాలకు వేల ఎకరాలను దారదత్తం చేసిన అశోక్ గజపతిరాజుని గత వైకాపా ప్రభుత్వం మానసిక క్షోభకు గురిచేసిందని, నీతినిజాయతీలకు నిలువుటద్దంలా ఉన్న ఆయనపై అక్రమ కేసులు పెట్టి వేధించడంతో పాటు అవమానించారని గుర్తు చేశారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఉత్తరాంధ్రను దోచుకోవడమే తప్ప ఇక్కడి నాయకులకు గౌవరం ఇవ్వలేదు. ఇక్కడి ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు.

గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పరిశ్రమలను కూడా ఉత్తరాంధ్ర నుంచి జగన్ ప్రభుత్వం తరిమేసిందని, కానీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు టీసీఎస్, కాగ్నిజాంట్, గూగుల్ డేటా సెంటర్లు విశాఖకు తరలివచ్చాయని గుర్తుచేశారు. విశాఖలో ఐటీ సెజ్, ఎన్టీపీసీ గ్రీన్, భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖ స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వేజోన్ ఇలా ఉత్తరాంధ్రకు ఒక్క ఏడాదిలోనే సాధించారని గోవిందరాజులు అన్నారు. ఉత్తరాంధ్ర పరిశ్రమల అభివృద్ధికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి నిధులు కేటాయించారని, ఇది ఉత్తరాంధ్ర జిల్లాలపై, ఉత్తరాంధ్ర ప్రజలపై చంద్రబాబు చూపిస్తున్న ఆదరణ, అభిమానానికి నిదర్శనమని కొనియాడారు.

## జిల్లా వజ్రోత్సవాల ప్రచారానికి
# ఏపీయూడబ్ల్యూజే ప్రణాళిక

**✴ బ్రోచర్ ఆవిష్కరించిన కలెక్టర్**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, వజ్రోత్సవాల కోసం ప్రచార కార్యక్రమం నిర్వహించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఒక ప్రణాళిక రూపొందించింది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం జడ్పీ హాల్లో ఆవిష్కరించారు. జర్నలిస్టులు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ఆయన అభినందిస్తూ, అధికార యంత్రాంగం తరఫున తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉత్సవాల కమిటీ కన్వీనర్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు విలేకరులతో మాట్లాడుతూ, ప్రచార ప్రణాళిక ఉద్దేశాన్ని వివరించారు. 1950 ఆగస్టు 15న శ్రీకాకుళం జిల్లా ఏర్పడిందని, డాక్టర్ జవహర్ రెడ్డి కలెక్టర్‌గా ఉన్నప్పుడు 2000 సంవత్సరంలో స్వర్ణోత్సవాలు జరిగాయని గుర్తు చేశారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఉత్సవాలను ప్రారంభించారని, మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలలో జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ప్రముఖులను ఆహ్వానించి, ఘనంగా సత్కరించినట్టు తెలిపారు. వజ్రోత్సవాలను కూడా అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి చెన్నకేశవరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సిహెచ్ జగదీష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పైడి బాలకృష్ణ, ఎం.వాసు, యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ కుంచి చిన్నారావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనకల రామారావు, యూనియన్ కోశాధికారి బారుకుల శ్రీనివాసరావు, స్వామ్నా జిల్లా అధ్యక్షుడు సున్నపు చిన్నారావు, ఎస్.నవచైతన్య, చౌదరి సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు పి.యోగేశ్వరరావు, జీవీ నాగభూషణ్, ఎ.చంద్రమోహన్, బి.మాధురి తదితరులు పాల్గొన్నారు.



## ఆన్‌లైన్ ఫిర్యాదుపై
# స్పందించిన కలెక్టర్



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పీజీఆర్ఎస్‌లో అర్జీని ఆన్‌లైన్ నమోదు చేయడం లేదని బాధితుడి ఫిర్యాదుపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి పౌరసరఫరాల శాఖ సిబ్బంది నిరాకరిస్తున్నారని లావేరు మండలం లక్ష్మీపురానికి చెందిన అర్జీదారుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ అర్జీని గ్రీవెన్స్ ఆన్‌లైన్ నమోదు కేంద్రం వద్దకు వెళ్లి సిబ్బంది వివరణ కోరారు. నమోదు కేంద్రంలోనే కలెక్టర్ కూర్చొని అర్జీదారుడి సమస్యను సిబ్బందితో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. చౌకధరల డిపోపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని గ్రీవెన్స్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అర్జీదారుడు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.















# మేజర్ కవిత.. బ్రహ్మపుత్ర విజేత



(మొదటిపేజీ తరువాయి)

తప్పించి దిగువకు తీసుకొచ్చారు. తన సాహస యాత్రల్లో ఈ ఘటన ఒక మైలు రాయిగా నిలిచిపోతుందని మేజర్ కవిత 'సత్యం'తో మాట్లాడుతూ పేర్కొన్నారు.

**బ్రహ్మపుత్రను జయించిన తొలి మహిళ**

మేజర్ కవిత మరో అరుదైన ఘనత సాధించారు. అత్యంత క్లిష్టమైన బ్రహ్మపుత్ర నదిలో రివర్ రాఫ్టింగ్ చేసిన తొలిమహిళగా రికార్డు సృష్టించారు. హిమాలయాల్లో పుట్టి చైనా, భారత్, బంగ్లాదేశ్‌లలో ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలిసే బ్రహ్మపుత్ర చాలా ఉధృతంగా ప్రవహించే నది. అందులోనూ నది పొడవునా ప్రవాహ తీవ్రత, అలల ఉధృతి కారణంగా సుడిగుండాలు ఏర్పడు తుంటాయి. వీటికితోడు నదిలో నీరు మంచులా గడ్డ కట్టించేంత చల్లగా ఉంటుంది. అందువల్ల ఆ నదిలో ప్రయాణం అత్యంగా ప్రమాదకరంగా పేర్కొంటారు. అటువంటి నదిలో కల్నల్ రణవీర్‌సింగ్ నేతృత్వంలోని పదిమంది సభ్యుల బృందం 1040 కిలోమీటర్ల మేరకు విజయవంతంగా రివర్ రాఫ్టింగ్ పూర్తిచేసింది. ఈ బృందంలో కవిత ఒక్కరే మహిళా సభ్యురాలు కావడం విశేషం. భారత-టిబెట్ సరిహద్దుల్లోని అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో గెల్లింగ్ గ్రామం వద్ద నుంచి బ్రహ్మపుత్రలో ప్రయాణం ప్రారంభించి ఏకధాటిగా 28 రోజులపాటు సాగిన సాహసయాత్ర అసోంలోని బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న హాట్సింగిమారి వద్ద ముగిసింది. ఈ యాత్రలో కవితతో సహా ఒక సుడిగుండంలో చిక్కుకుని ప్రమాదంలో పడింది. కొన్ని నిముషాలపాటు ఆమె పడవ లోంచి నదిలో పడి నీటి అడుగుకు వెళ్లిపోయారు. అయితే అదృష్టవశాత్తు వెంటనే తేరుకుని ఎలాగోలా తప్పించుకుని బయటపడ్డారు. ఈ యాత్రలో రోజుకు 12 గంటలపాటు ఏకబిగిన 70 కిలోమీటర్ల మేరకు ప్రయాణించి రాత్రివేళల్లో విశ్రాంతి తీసుకునేవారమని కవిత చెప్పారు.

**గవర్నర్ ప్రశంసలు**

సైన్యంలో మేజర్ హోదాలో డాక్టర్‌గా పని చేస్తున్న కవిత సాధించిన విజయాలు, సృష్టించిన రికార్డులు చరిత్రకెక్కడంతోపాటు ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నాయి. అవార్డులు అందిస్తున్నాయి. ఈ నెల 26న ఏపీ గవర్నర్ నజీర్ అహ్మద్‌ను మేజర్ కవిత తన తల్లిదండ్రులతో సహా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ కవిత సాహస కృత్యాలను ప్రశంసించారు. ప్రశంసాపత్రం కూడా అందజేశారు. ఇక సైన్యంలో సేవలకు గుర్తింపుగా కవిత చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అవార్డు అందుకున్నారు. గౌరీచెన్ పర్వతారోహణ సందర్భంగా ప్రమాదంలో పడిన తోటి పర్వతారోహకురాలిని చికిత్స చేసినందుకు మేజర్ కవిత రాష్ట్రపతి విశిష్ట సేవా మెడల్‌కు ఎంపికయ్యారు. బ్రహ్మపుత్రలో రివర్ రాఫ్టింగ్‌ను విజయవంతంగా చేసినందుకుగాను అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ఫెమా ఖండు ఆమెను ప్రశంసించారు. బ్రహ్మపుత్రలో రివర్ రాఫ్టింగ్ చేసిన రికార్డును లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేసింది. ఆ మేరకు కవితకు సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ సాహస యాత్ర తన జీవితంలో మధురానుభూతిగా నిలిచిపోతుందని కవిత పేర్కొన్నారు. తన విజయాలకు తల్లిదండ్రులే కారణమని అన్నారు. వారి సహకారం, ప్రోత్సాహంతోనే పట్టుదలతో చదివి వైద్యవిద్య అభ్యసించడం, సైన్యం చేరడం తనకు సాధ్యమైందని మేజర్ కవిత చెప్పారు.



### ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నామినేషన్లు పంపండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అఖిల భారత్ ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య పూర్వాధ్యక్షుడు, దివంగత నాయకుడు రాంపాల్ సింగ్ పేరు మీద జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం నామినేషన్లు స్వీకరించనున్నారని ఆప్టా జిల్లా అధ్యక్షులు ఎస్‌వీఎస్‌ఎల్ పూర్ణిమ, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్మోహనరావులు సోమవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. తగిన ఆసక్తి, అర్హత కలిగినవారు లింకు ద్వారా వివరాలు, ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాంపాల్ సింగ్, అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ అధ్యక్షుడుగా, ప్రధాన కార్యదర్శిగా, సార్క్ సభ్య దేశాల ఉపాధ్యాయ సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా, ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ బోర్డు సభ్యుడిగా ఉంటూ ఉపాధ్యాయులకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఆసక్తి, అర్హత గల ఉపాధ్యాయులు పూర్తి వివరాలను rpsmemorialtrust@gmail.comకు మెయిన్ చేయాలన్నారు.



## ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ బడులు



(సత్యంన్యూస్, సంతకవిటి)

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులు ఉన్నాయని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ భాస్కరరావు పేర్కొన్నారు. ఈమేరకు మండలంలోని మాధవరాయపురం పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాల పనితీరు, విద్యార్థుల సామర్థ్యం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులంతా చక్కగా చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను కలిగి ఉన్నారన్నారు. ఈ విధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యాభివృద్ధి జరిగి ప్రభుత్వ పాఠశాలన్నీ బలోపేతమై విద్యా వ్యవస్థను పటిష్టం చేసే విధంగా చూడాలన్నారు. అనంతరం నూతన డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి భాస్కరరావు, సహ ఉపాధ్యాయులు చౌదరి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు

## సమాధులతోటలో క్లీన్&గ్రీన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పాస్టర్స్ & లీడర్స్ అసోసియేషన్, బరియల్ గ్రౌండ్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో నగర, మండల పరిధిలో గల క్రైస్తవ సంఘాల సహకారంతో శ్రీకాకుళం లోని క్రైస్తవ సమాధుల తోటను శుభ్రపరిచి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ వద్ద గల బరియల్ గ్రౌండ్ సమాధులతోటను శ్రమదానం ద్వారా శుభ్రపరిచారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కృపానందం, డివిడివి కుమార్, విక్టర్ జోసెఫ్, జాన్ డేవిడ్, కె.విశ్వాసరావు, డిబిడిబి కుమార్, మోషే, ఎల్.ప్రకాష్‌రావు, ఫిలిప్పు, చల్లా కరుణాకర్‌రావు, జాక బాధికారి, మోహన్‌రావు, ఆయా కమిటీల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## బాలల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే గుర్తించి చికిత్స అందించడమే రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం లక్ష్యమని, పైసా ఖర్చు లేకుండా పూర్తి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత తెలిపారు. ఆర్బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇప్పిలి వెంకట్ పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా 3,06,516 మంది విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం కింద అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నారుల్లో జబ్బుల లక్షణాలను తొందరగా గుర్తించి తగిన చికిత్స అందించడం, తీవ్రమైన సమస్యలున్న వారిని మెరుగైన సదుపాయాలున్న ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. పరిశీలనలో భాగంగా విద్యార్థుల బరువు, ఎత్తు, దృష్టి, వినికిడి, మానసిక ఆరోగ్యం, దంతం, చర్మ సంబంధ సమస్యలు, రక్తహీనత వంటి అంశాలపై పరీక్షలు జరుగనున్నాయన్నారు. ఇప్పటివరకు వైద్యసిబ్బందికి శిక్షణ పూర్తయ్యిందని, ప్రస్తుతం విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. ఈ నెల 15 నుంచి జిల్లాలో ఆరోగ్య పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నతనంలోనే ఆరోగ్య సమస్యలు గుర్తించి సమయానికి పరిష్కరించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ఆరోగ్యంగా ఉండేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు వెల్లడించారు.



## రాజకీయ కత్తుల కరచాలనం!

(మొదటిపేజీ తరువాయి)


పాటించారు. ఆయన వచ్చాక ఇద్దరూ ఒకసారే ఆశీనులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే గొండు శంకర్‌నే నిర్వాహకులు నిర్ణయించారు. కానీ పెద్దవారిని గౌరవించాలన్న ఉద్దేశంతో శంకర్ తానే కాస్త తగ్గారు. మాజీమంత్రి ధర్మాననే ముఖ్యఅతిధి స్థానంలో మాట్లాడించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ దృశ్యాలను చూసినవారు నేటి రాజకీయాల్లో ఇటువంటివి కనగలమా? అని ఆశ్చర్యానందాలతో వ్యాఖ్యానించారు. తాను సిట్టింగ్ ఎమ్మెల్యే అయినప్పటికీ, తన చేతిలో ధర్మాన ఓడిపోయినప్పటికీ.. రాజకీయాల్లో తనకంటే సీనియర్ అయిన ధర్మానను గౌరవించడం ద్వారా విలువలున్న నేతగా గొండు శంకర్ మన్ననలందుకున్నారు.



## అట్టాడ చరణ్‌కు కలెక్టర్ సన్మానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కాంస్య పతకం సాధించిన అట్టాడ చరణ్‌ను సన్మానించి అభినందించారు. థాయిలాండ్ వేదికగా ప్రతిష్టాత్మక 2వ ఏషియన్ అండర్-16(మెన్) వాలీబాల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహించారు. భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున చరణ్ ప్రాతినిధ్యం వహించారు. ఈ సన్మానంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.




## రిమ్స్ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రిమ్స్ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు రిమ్స్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సోమవారం ప్రజాపరిష్కార వేదికలో భాగంగా వారి సమస్యలను కలెక్టర్‌కు తెలియజేశారు. గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో 15 ఏళ్ళుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్నామని, సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాత కాంట్రాక్టర్ మే నెల వేతనం, ఏప్రిల్, మే ఏరియర్స్ చెల్లించలేదన్నారు. జూన్ నుండి కొత్త కాంట్రాక్టర్ బాధ్యతలు తీసుకుని రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వేతనం చెల్లించలేదన్నారు. ధరలు ఆకాశానంటుతుంటే అతితక్కువ వేతనంతో కుటుంబాన్ని నెట్టుకురావడం భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కో-కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, రిమ్స్ నాయకులు ఎం.సూర్యనారాయణ, టి.రామారావు, బి.శ్రీను, ఎస్.రాజేంద్ర, ఎం.శ్రీను, హెచ్.లక్ష్మణ, టి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



## కలుషిత ఆహారంతో హెపటైటిస్ ముప్పు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం నగరంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఫైబ్రో స్కానింగ్ వైద్య సేవలు ఒక వైద్యశాలలో ఉచితంగా నిర్వహించినట్లు సేవా సమితి అధ్యక్షులు బోడిగి మధు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న ప్రముఖ గ్యాస్ట్రో వైద్యనిపుణులు ఆర్.ప్రశాంత్ మాట్లాడుతూ హెపటైటిస్ అనే వ్యాధిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, వ్యాధి చివరిదశకు చేరుకున్న తర్వాత వైద్యులు వద్దకు వస్తున్నారన్నారు. హైటైటిస్ వల్ల వచ్చే లక్షణాలను సాధారణ లక్షణాలుగా చూసి నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇందు కోసం ప్రజల్లో హెపటైటిస్‌పై అవగాహన పెంచాలని ప్రతి సంవత్సరం జూలై 28న అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. సిరోసిస్, కాలేయ క్యాన్సర్ వంటివి కారణంగా చాలామంది మృతి చెందుతున్నారని, ఇటీవల కాలంలో మన శ్రీకాకుళం, పరిసర ప్రాంత ప్రజలకు ఆధునిక జీవన శైలికి అలవాటు పడుతున్నారని, తీసుకునే కలుషిత ఆహారం, నీరు వల్ల ఈ హైపటైటిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. రోడ్ల పక్కన వెలుస్తున్న చిరుతిండి బండ్ల వద్ద శుచి, శుభ్రత లేక పోవడం, ఈ ఆరోగ్య సమస్యలకు కారణమని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ వర్ష కాలంలో ఇంటి ఆహారానికి పరిమితం కావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు కిరణ్‌కుమార్, హేమశేఖర్, రాజు, సోమేశ్, సుధాకర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

(సత్యంన్యూస్, పాతపట్నం)

పాతపట్నం మేజర్ పంచాయతీలో గల మహేంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గంలో నైపుణ్యం ఉన్నత విద్య అభ్యసించినప్పటికి నిరుద్యోగులు వేలాది సంఖ్యలో ఉన్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తుందన్నారు.ఇటువంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని యువతీ యువకులు ఆయా పరిశ్రమల్లో ఉద్యోగం సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు. వెనుకబడిన నియోజకవర్గంలో ఇటువంటి జాబ్‌మేళాలు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. అరబిందో,అపోలో, ట్రైర్స్‌తోపాటు సుమారు 15కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాను నిర్వహించారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేటతో పాటు పలు గ్రామాల నుంచి సుమారు 200మంది యువకులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. వారికి ఆసక్తి ఉన్న ఉద్యోగంలో వారు చేరాలని యువతకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేంద్ర విద్యాసంస్థల ఏండీ శాసనపూరి మధుబాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సాయి, సెట్ సీఈవో ప్రసాద్ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కిష్టప్పపేటలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా జాతీయ అధ్యక్షులు జగన్మోహనరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చేపడుతున్న "బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలో సానివాడ, కిష్టప్పపేట పంచాయితీల్లో సోమవారం వైకాపా నాయకులు ఇంటింటికీ వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షులు చిట్టి జనార్ధన్, ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైకాపా శ్రేణులు ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. 14 నెలల కూటమి పాలన అంతా మోసపూరితంగానే సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇంటింటికీ వంచన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తామన్న హామీలు అమలు జరిగేంత వరకు ప్రజల తరుపున పోరాడాలని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి సూచించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి ఎచ్చెర్ల శ్రీధర్, వైకాపా రాష్ట్ర బీసీ కార్యదర్శి బాన్న నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, జిల్లా & గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు రౌతు శంకరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మూకళ్ళ తాతబాబు, ఎంపీటీసీలు రుప్ప అప్పలసూరి, బగ్గు అప్పారావు, రాగోలు సర్పంచ్ గేదెల చెంగళరావు, చిట్టి రవికుమార్, మాజీ సర్పంచ్ ఉంగటి గోపాలరావు, అల్లు లక్ష్మీనారాయణ, యజ్జల గురుమూర్తి, నియోజకవర్గ యువజన అధ్యక్షులు గుండ హరీష్, శిమ్మ భగవాన్ దాస్, బాన్న శీను, ముద్దాడ రామారావు, నియోజకవర్గం గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు యస్.సత్యనారాయణ, చల్లా రవి, గంగు నరేంద్ర, గొండు కృష్ణమూర్తి, ఊట కృష్ణారావులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏపీఐఐసీ జిల్లా మేనేజర్, జోనల్ మేనేజర్ మురళీమోహన్‌తో సోమవారం నిర్వహించిన సమావేశం లో వెనుకబడిన, పూర్తి వ్యవసాయ ఆధారిత మండలం, వలసలు నివారించి, పండిన పంటలకు అనువుగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంసిద్ధంగా ఉన్నారని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు.- **సత్యంన్యూస్, రణస్థలం**

# ప్రజా శ్రేయస్సు కోసమే "కూటమి అడుగులు"

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా శ్రేయస్సు కోసమే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా నియోజకవర్గ రూరల్ మండలం బైరి, కరజాడ గ్రామాలలో సోమవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి, కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధిని వివరించి, పాలన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరితపిస్తారన్నారు. అందుకు అనుగుణంగానే సుపరిపాలన చేస్తున్నారన్నారు. కూటమి అంటేనే పేద ప్రజల ప్రభుత్వమని, ప్రజలకు ఏం కావాలో అదే సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నారన్నారు. అనంతరం చిన్నారులతో కాసేపు ముచ్చటించి ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకొని, గ్రామ సమస్యలను విని, సంబంధిత అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష బృందం, గ్రామ టీడీపీ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.